# మూడో కన్ను

పొద్దు పొడువక ముందే కోడి కూసింది.

కోడి కుయ్యక ముందే న్యూస్ పేపర్ వచ్చింది.

న్యూస్ పేపర్ రాక ముందే హోటల్ తెరిచింద్రు.

హోటల్ తెరువక ముందే చాయకోసం జనం వచ్చింద్రు.

వేడి వేడి వార్తల కోసం పేపర్ చూసింద్రు.

ఆ ఊరికి సంబంధించిన వార్త అందరి కండ్లను కట్టి పడేసింది.

"ఎవలు....? 'ఎవరు...?' అని ఒకలను ఒకలు అడుక్కున్నరు. లోపల లోపల ఉడుక్కున్నరు.

అంతే! ఆరోజు కోడి కుయ్యలేదు. పేపరే కోడై కూసింది.

బలబల తెల్లారుతుండంగ లేచింది సునీత. రాత్రంతా అదే ఆలోచన. నిద్రపట్టలేదు. కండ్లు మండుతున్నయి. ఇంకొంత సేపు అట్లనే ఆగింది. కన్ను మలుగలేదు.

పక్కన ఐదేండ్ల కొడుకున్నడు. కొంగును ముడుచుకుని పన్నడు. కొడుకు పక్కలోంచి కొంగును తిసి చెద్దరు కప్పింది సునీత. లేచి చీపురు అందుకుంది.

తలుపు తెరవాలంటే భయమయింది. కానల నుంచి తొంగిచూసింది. బజార్ల వచ్చిపోయే టోళ్ళు కనవడ్డరు. ధైర్నంగా తలుపు తెరిచింది.

వాకిలి సూకుతుంటే గూడా భయం. ఎనుకనే ఎవలో నిలవడ్డట్టు. తన మీద పడుతున్నట్టు. అడుగడుగునా ఉల్కిపడుతుంది సునీత. ఉల్కిపడుతూనే వాకిలి సూకింది. సానుపు సల్లింది.

సూకి సల్లినంత సేపు బజార్లో వచ్చిపోయేటోళ్ళను సూత్తనే ఉంది. వాళ్ళు తన వాకిలి దగ్గర కాలును ఆపుతున్నరు. తనదిక్కే సూత్తున్నరు. తను వాళ్లను చూసే తలికి దబదబ నడిచి పోతున్నరు.

మొదలు తన అనుమానమే అనుకుంది సునీత. ఒకలిద్దరిని చూసినంక నిజమే అని తేలిపోయింది. ఏదో గుసగుస పెట్టుకుంటున్నరు. తనదిక్కే సూపిత్తున్నరు. ఇప్పటికే భయంతో ఉంది. ఇప్పుడు కొత్త భయం మొదలయింది.

తలుపులు మూసి బేడెం బెట్టింది సునిత. వచ్చి కాన దగ్గర నిలవడ్డది. కాన సందుల నుంచి బజార్లకు సూత్తంది.

హోటళ్ళకు, మోటర్‌కు పాలు పోసేటోళ్ళు చెంబులు సర్వలు పట్టుక పోతున్నరు. కొందరు పట్టనట్టే పోతున్నరు. కొందరు మాత్రం నిలబడి ఇల్లును సూపిత్తున్నరు. ఏదో మాట్లాడుకుంటున్నరు.

సునీతకు దడ దడ పుట్టింది. కాళ్ళు కడుపుల జొచ్చినయి.

'ఏంది.... ఈ మందికి ఏంబుట్టింది... అందరు నా ఇల్లును సూపిత్తండ్రు. ఈ మందికి మర్నగాలం గాను' అనుకుంది.

లేచి ఇంట్లకు నడిచింది. ఏదో పని చెయ్యాలనుకుంటుంది. చెయ్యబుద్ధయితలేదు. వచ్చి కాన దగ్గర నిలబడుతుంది.

అటన ఇటన మొత్తం తెల్లారింది. బజార్ల సందడి పెరిగింది. బర్లు మనుసులు కలే తిరుగుతున్నరు. ఈసారి మొఖాలు తేంటుగా కనవడుతున్నయి. ఇంటిదిక్కు సూపులు తిప్పుతున్నరు. వంకరగా నవ్వుతున్నరు.

అది తన అనుమానమే అని మనసుల ఏదో మూలన ఆశగా ఉండె. అదిప్పుడు అడుగంటిపోయింది సునీతకు.

'అయింది. అంతా అయిపోయింది. తను దాచాలనుకున్న సంగతి ఊరంతా ఎలిసి పారినట్టుంది. లేకుంటే ఆ వంకర సూపు లేంది...వంకర నవ్వులేంది!!" అనుకుంది.

తలుపు తియ్యాలంటే భయమయింది. బేడమేసి ఉంచలేక కొద్దిగా తెరిచి పెట్టింది. అప్పుడే ఫోన్ ట్రింగ్‌మంది.

నిలువునా ఉలిక్కిపడ్డది సునిత. ఫోన్ ఎత్తాలంటే భయమయింది. మోగుతుంటే మోగుతుంటే ఎత్తి తడారిన గొంతుతో హలో అంది.

"ఆ... నేనే సర్పంచ్ రాజును. ఎవలన్న ఫోన్ చేసింద్రా" బయట నుండి

"ఎందుకు...? దేనికి...?" అని అడుగాలన్న ఆలోచన గూడా రాలేదు సునీతకు. 'చెయ్యలేదు' అంది బొంగురు గొంతుతో.

"నువ్వేం భయపడకు. ఎవ్వనితోని ఏంగాదు. పేపరోళ్లకు దొరికిందే వార్త. పెండ్లాం మొగల్ల పంచాది గూడా రాత్తరు. గోరంతదాన్ని కొండంత జేత్తరు. కాదు బోదంటే నాలుగు రోజులు మీ అవ్వగారింటికిపో.... అంత సల్లవడుతది. ఇదంతా దేవిరెడ్డిగాని పనే. వాని సంగతి తర్వాత సూసుకుంట..." చెప్పుకపోతండు సర్పంచ్.

అసలు సంగతేంటో అడుగనే లేదని ఫోన్ పెట్టినంక యాదికచ్చింది. మల్లా ఫోన్ చేద్దామంటే నంబర్లు ఒత్తరాదు.

నిలువు నిత్తారం కూలవడిపోయింది సునీత.

★ ★ ★

పొద్దుపొడుపు నీరెండ గ్రామ పంచాదిల పడుతుంది. నీరెండకు కుర్చీ జరుపుకుని కూసున్నడు రాజు. ముండ్లమీద కూసున్నట్టు కూసున్నడు.

ఆదర బాదరగా అక్కడికి బాలయ్య వచ్చిండు.

"ఆ... బాలన్న.... దా... నీ కోసమే సూత్తన్న. సుంకరోళ్ళను తోలితిగదా... రాలేదా" రాజు అన్నడు.

"వచ్చింద్రు... నిలవడనియ్యక పాయిరి. వత్తున్న పారా అంటే కదులరు. ఏం పని" బాలయ్య.

"ఇంకేం పని అదే పని. మనకెందుకే పంచాది అంటే ఇనకపోతివి. నలుగురు వింటే నాలుగు లోకాలు ఇన్నట్టు అంటివి. దాని బతుకు బజారు పాలైతదంటివి. ఎవలకు తెల్వకుంట జేత్తామంటివి. ఇప్పుడు జూడు. పంచాది మన మెడకు సుట్టుకుంది" చెప్పిండు రాజు.

"ఏందిరా... కొనలేదు మొదలు లేదు. వాగుతున్నవు. ఏమైంది.. "కుర్చీ పక్కకు జరుపుకుని కూసుంటూ యాష్టగా అన్నడు బాలయ్య.

"పేపర్ సూడలేదా... ఊరంతా ఎలిసిపారె. నువ్వు తెలువదనవడితివి. నేనేమన్న...! జురుమాన వద్దన లేదా...? వానికి భయముండది... ఇంకోదాన్ని ఇట్లనే అంటడు. భయం పెట్టాలె అంటివి... ఇప్పుడు పేపర్ల ఏం రాసింద్రు సూడు. ఐదువెయిలు మనమే తిన్నమట" దీంట్ల మనం ఏదో తిన్నమని వాన్ని పంచాదికి పిలువ లేదని దేవిరెడ్డిగాడే ఉప్పు అందిచ్చి ఉంటడు" రాజు చెప్పిందు.

బాలయ్యకు మొత్తం అర్థమైంది. పేపర్ పేరు చెప్పంగనే భయమయింది.

"నాదేం తప్పురా... ఎందు నెరుగని పొల్ల. ఒకలను నొచ్చినోట మాటనది. వానికి కండ కావుర మచ్చి దాని చెయ్యివట్టి. దాని మొగడు మస్కట్‌లుండె. అది ఏడ్చుకుంట నాదగ్గరికచ్చె. నలుగురిల పడుడు ఎందుకని సాటుకు భయం చెప్పితిమి. ఇప్పుడు దాని మొగనికి తెలిస్తే వాడెంత గరానికి రావాలె... పోరి గతి ఎట్లగావాలె" బాలయ్య అన్నడు.

రాజుకు కోపమొచ్చింది. "పోరిగతిగాదు. ముందు మనగతి సూడు. ఐదు వెయిలు అప్పటి కప్పుడే అనుమండ్ల గుడికి ఇచ్చినంగదా... వాటిని మనమే తిన్నమట. ఐదుగాదట. పది వెయిలట. పంచాది మనమే పెట్టిచ్చినమట. వానికి మనమే సైడిచ్చినమట. ఒక్రంగ దండుగ తీసినమట. ఇంకా ఏదేదో రాసి న్యూస్‌ను హైలైట్ జేసింద్రు" చెప్పిందు రాజు.

"ఏదో... ఇల్లు దాటని పొల్ల. పోరని అయ్యగూడ మ్యాదకుడు. బయటకు తెలువద్దనిరి. ఇజ్జత్ ముచ్చట గదా... బయటకు ఎట్ల తెలిసింది" అనుమానంగా అడిగిండు బాలయ్య.

బాలయ్య మాటలకు రాజు నవ్విందు. నవ్వుతూ "మొన్న ఎరుకలోళ్ళు మొగడు పెండ్లాలు కొట్టుకున్నరు. అది పేపరుకు ఎట్లెరుకయింది...? భార్యపై భర్త హత్యాయత్నమని రాసిరి. పోలీసోళ్లు పొట్టు పొట్టు జేసిరి. అడివి పందులచ్చి చెరుకు పంటను చెడగొడుతున్నయని కావలిపోతే 'వన్యమృగాల పై దాడి' అని రాసిరి. వాని ఇల్లు ముంచిరి. పోలీసోళ్ళకు నక్సలైట్లకు ఇన్‌ఫార్మర్లున్నట్టే విలేఖర్లకు ఇన్‌ఫార్మర్లుంటరు. వీళ్ళు ఏదో చెప్తుతరు. వాళ్ళు దానికి ఉప్పుకారం అద్ది ఉన్నది లేంది రాత్తరు. పేపరోళ్లకు పేపరోళ్ళకు పోటీగదా... నడుమ జనాల కాళ్ళు ఇరుగవెడుతరు" అన్నడు.

అంట అంటుండగనే సెల్ ఫోన్ మొగింది. నెంబర్ చూసి గజ్జుమన్నడు రాజు. "చూసినవా... పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్. ఆ పదివెయిలు ఇయ్య మంటరు. పంచాది చెప్పుడుకు మీరెవల్రా అంటరు" అన్నడు భయంగా.

"నీకేం భయం.... నువ్వు తిన్నవా...? గుడి కమిటీకి ఇచ్చిన్నని చెప్పు. వాళ్లనే అడుగుతరు. పదిగాదు ఐదేనని చెప్పు. అవద్దమనుకుంటే అసలోళ్లను పిలువుమను" అన్నడు బాలయ్య.

రాజు ఫోన్‌ల మాట్లాడుతుండు.

బాలయ్య పేపర్ సదువుతుండు.

★ ★ ★

ఎట్లనో నిలదొక్కుకుని లేచింది సునిత. తలుపు తెరువాలంటే భయమయితుంది. వాకిట్ల 'అడుగుల సప్పుడు, అటు తొంగి చూసింది. ఎదురింటి ఎల్లమ్మ.

'కొంపల గుత్తపోరి... వారం కింద జరిగిందట. ఒక్క ముచ్చట చెప్పవాయె. ఇంటి ముంగటిల్లు... ' అంటూ దగ్గరికి వచ్చింది. సునిత కండ్లల్ల నీళ్ళు తిరిగినయి.

"ఊరంతా ఎలిసి పారింది గనీ ఇంకేం దాత్తవు... యానంగ వచ్చిందు.....? యాడ వట్టిందు?" అడిగింది.

ఏడ్సుకుంటనే చెప్పింది సునిత.

అంతా విన్నంక ఎల్లమ్మ మూతి తిప్పింది. "అట్ల గాదట గద పిల్లా... నాకేం ఎరుకగనీ మా మనుమడు పేపర్ తెచ్చిందు" అన్నది.

"ఎట్లా...?" అని అడుగలేదు సునిత.

"ఏ మర్మం తెలువనిది ఇంట్లకు ఎట్లత్తడు.... నా కోడండ్లు ఒంటిగలేరా ఏడెనిమిదేండ్లు. చెప్పుకాలోడు అడుగువెట్టిండా" ఎల్లమ్మ అన్నది. అంటూ గడుప దాటింది..

ఏం జరిగిందో మొత్తం తెలిసిపోయింది సునీతకు. ఏడువేడువున దుఃఖమత్తంది. బరువు దిగేతట్టు ఏడుద్దామన్నా భయమైతంది. ఒక్కక్షణం గూడా నిలువడానికి ధైర్నం మాసలేదు.

కొడుకును సంకలేసుకుంది. తాళం అందుకుంది. తలుపులు మూత్తుండంగ యాదికచ్చింది సునితకు. ఆ రోజు శుక్రవారమని. భర్త ఫోన్ జేత్తడని. కదులుదామంటే కాలు ఆడలేదు. మూసిన తలుపు తెరిచి కన్నీళ్ళతోనే కడుప లోపలికి వచ్చింది.

'తనేం తప్పు చేసింది...? జరిగిన దాంట్లో తన తప్పేముంది...? రెండు మూడు రింగులకు గాని ఫోన్ ఎత్తకుంటే ఏం జేత్తున్నవని అనుమానపడే

భర్త... ఏ పట్టపగలో అర్ధరాత్రో ఎప్పుడు చేసినా ఇంట్లో ఉండటానికి ఫోన్‌ను కావలిగా పెట్టిన భర్త... సంగతి తెలిత్తే బతుకనియ్యడని మూడో కంటికి తెలువగూడదనుకుంది.

కానీ ఇప్పుడు మూడో కన్ను తెరుచుకుంది. ఇంట్ల ఫోన్‌లున్నయి. జేబులల్ల సెల్ ఫోన్‌లున్నయి. ఊర్లె కడుపునొత్తె మస్కట్‌లో మందు తాగుతండ్రు. ఇక్కడ చిటికేత్తే అక్కడికి ఇనపడుతుంది. ఇప్పుడు ఎట్లా...? ఆలోచనల్లో పడ్డది సునీత. ఆమె ఆలోచనల్తో పనిలేకుండా ఫోన్ మోగింది.

లాంగ్.... రింగ్.... ఐ. ఎ.స్.డి. కాల్!

● నేటి నిజం, శివరాత్రి ప్రత్యేక అనుబంధం - 2006 ●